## సాగర్‌కు భారీగా వరద

**2,57,634 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

**26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల**



నందికొండ, ఆగస్టు 29 : నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద పోటెత్తుతున్నది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 2,57,634 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండడంతో గురువారం సాగర్ డ్యామ్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి 2,10,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎడమ కాల్వ ద్వారా 8,280 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 9,274 క్యూసెక్కులు, జలవిద్యుత్ కేంద్రం ద్వారా 27080, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 590 (312.50 టీఎంసీలు) అడుగులు కాగా, ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీరుంది.

# జిల్లాకు జ్వరం

## సూర్యాపేట జిల్లాలో 29 రోజుల్లో 406 డెంగ్యూ కేసులు

- ప్రతి ఇంట్లో జ్వర పీడితులే..
- రోగులతో కిటకిటలాడుతున్న దవాఖానలు
- ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ

**సూర్యాపేట జిల్లాలో వైరల్ ఫీవర్, డెంగ్యూ కేసులు విపరీతంగా నమోదు అవుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. దాదాపు ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. నొప్పులతో గోస తీస్తున్నారు. గత 29 రోజుల్లోనే జిల్లావ్యాప్తంగా 406 డెంగ్యూ కేసులు నమోదయయ్యాయి. ఇక, వైరల్ ఫీవర్ కేసులు లెక్కకు అందని పరిస్థితి.**

– సూర్యాపేట, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ)



జ్వర పీడితులు, డాక్టర్లతో కిటకిటలాడుతున్న సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

వర్షాకాలం జ్వరాలు సహజమే అయినా.. ఈసారి పరిస్థితి విపరీతంగా ఉంది. గత పదేండ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు కనిపించలేదు. బీఆర్ఎస్ సర్కారు పల్లెప్రగతి పేరిట గ్రామాలకు నెలనెలా నిధులు కేటాయించి పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో వైరల్ ఫీవర్లు పెద్దగా నమోదు కాలేదు. పల్లెలు, పట్టణాల్లో దోమల మందు కూడా క్రమం తప్పకుండా చల్లేవారు. ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. దోమల మందు ఎక్కడా కొడుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫలితంగా దోమల వ్యాప్తి పెరిగి జనం జ్వరాల బారిన పడుతున్నారు. సూర్యాపేట జిల్లాలో ఈ నెలలో ఇప్పటివరకు 406 డెంగ్యూ కేసులు నమోదవడం పరిస్థితిని తెలుపుతున్నది. వైరల్ ఫీవర్ కేసులకు అంతే లేదు. వాతావరణ మార్పులు, పారిశుధ్య నిర్వహణ లోపం కారణంగా పరిస్థితులు మరింత క్లిష్టంగా మారుతున్నాయి. ఏ దవాఖానలో చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి అంటూ అవస్థ పడుతున్నారు.

### ప్రైవేట్‌లో దోపిడీ

వైరల్ ఫీవర్లతో ఆరోగ్య పరంగా ఇబ్బంది పడుతున్న జనాన్ని ప్రైవేట్ దవాఖానలు ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయి. జ్వరమని దవాఖానకు వెళ్లిందే ఆలస్యం అవసరం ఉన్నా, లేకున్నా అడ్డగోలు టెస్టులు రాస్తున్నారు. ఇబ్బడి ముబ్బడిగా మెడిసిన్ ఇస్తున్నారు. డెంగ్యూ వచ్చిందని ప్లేట్‌లెట్స్ ఎక్కించాలనే పేరుతో అందిన కాడికి దండుకుంటున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసి దోపిడీని అడ్డుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీలు చేస్తూ వైద్యులను అప్రమత్తం చేస్తున్నా.. జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వస్తున్నాయి.






కోదాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఐవీ క్యానులాతో చిన్నారి

### జ్వరం రాగానే టెస్టులు వద్దు



గత పదేండ్లలో ఈస్థాయిలో జ్వరాలు లేవు. వంద మంది ఆసుపత్రికి వస్తే 95 మంది జ్వరంతోనే వస్తున్నారు. జ్వరం వచ్చిన 24 గంటల తరువాతే ఏ టెస్టు అయినా చేయాలి తప్ప వెంటనే అవసరం లేదు. కొందరు నేరుగా ల్యాబ్‌కు వెళ్లి అనేక టెస్టులు చేసుకొని రిపోర్టుల కట్టతో వస్తున్నారు.. అది కరెక్ట్ కాదు. జ్వరం వచ్చిన వెంటనే అది డెంగ్యూ అయినా సరే టెంపరేచర్‌ను బట్టి ప్రతి ఆరు గంటలకు ఒక పారాసిటమాల్ గోలి వేసి, అవసరమైతే శరీరం డీహైడ్రేషన్ కాకుండా గ్లూకోజ్ పెడితే సరిపోతుంది. ఏ జ్వరమైనా భయపడాల్సిన పని లేదు. కానీ జాగ్రత్త తప్పనిసరి. ప్రధానంగా నిల్వ నీటిలో ఉండే దోమలు కుడితే డెంగ్యూ వస్తుంది. అందుకని పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. పూల తొట్లు, కూలర్లు, ఖాళీ సీసాలు, టైర్లు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి.

**- రామ్మూర్తి, జనరల్ ఫిజీషియన్**

## ఆధ్యాత్మికత.. సంస్కృతికి యాదాద్రి భువనగిరి ఎంతో ప్రసిద్ధి

- జిల్లాలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన
- కొలనుపాక ఆలయాలు, స్వర్ణగిరి సందర్శన
- రచయితలు, కళాకారులు, అవార్డు గ్రహీతలతో ముఖాముఖి



కొలనుపాక సోమేశ్వరాలయంలో పురాతన శాసనాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి జిల్లాలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం విస్తృతంగా పర్యటించారు. జనగాం పర్యటన ముగించుకుని గవర్నర్ మధ్నాహానికి నేరుగా ఆలేరు మండలంలోని కొలనుపాకకు చేరుకున్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హన్మంతు కే జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర స్వాగతం పలికారు. తొలుత జైన మందిరం, అనంతరం సోమేశ్వరాలయానికి చేరుకుని పూజలు చేశారు. మ్యూజియం, శాసనాలను పరిశీలించారు. అనంతరం భువనగిరి పట్టణ పరిధిలోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లగా.. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, వేదపండితులు స్వాగతం పలికారు. వేంకటేశ్వరుడికి గవర్నర్ ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరుకుని రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీతలతో ముఖాముఖిలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమర యోధులు మన్నె గోపాలరెడ్డి, పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్లానాయక్‌ను గవర్నర్ వారి వద్దకే వెళ్లి శాలువాలతో సత్కరించారు. రాత్రి 8.05 గంటలకు ముఖాముఖి ముగియగా, గవర్నర్ అక్కడే భోజనం చేసి రాత్రి 9గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. సమావేశంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం, జాయింట్ సెక్రటరీ జె.భవానీ శంకర్ పాల్గొన్నారు.



నల్లగొండలోని బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

## నల్లగొండను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చుతా

- సెప్టెంబర్ 12న సీఎం చేతుల మీదుగా మెడికల్ కళాశాల భవనం ప్రారంభం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ప్రతీక్ మెమోరియల్ ఆధ్వర్యంలో బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

రామగిరి, ఆగస్టు 29 : నల్లగొండను ఎడ్యుకేషన్ హబ్‌గా మర్చడమే తన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రకాశంబజార్‌లో కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ఆధ్వర్యంలో రూ.3కోట్లతో నిర్మించనున్న బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవనానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలల పట్ల చిన్నచూపు పోవాలన్నారు. 1952లో ప్రారంభమైన బొట్టుగూడ పాఠశాల ఎందరో మేధావులు, ఇంజినీర్లు, అధికారులు, డాక్టర్లను అందించిందని తెలిపారు. బొట్టుగూడ పాఠశాలను చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విధంగా ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.3కోట్లతో నూతన భవనం నిర్మిస్తామన్నారు. పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.50వేలు, 9.7 జీపీఏ వచ్చిన వారికి 30వేలు, 9.5 వచ్చిన వారి 20వేలు నగదు ప్రోత్సాహాన్ని సొంతంగా అందిస్తానని ప్రకటించారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని సాధన దిశగా కృషి చేయాలన్నారు. ఫిబ్రవరిలోగా పాఠశాల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలను సెప్టెంబర్ 12న సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. నల్లగొండలో రూ.20కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మిస్తామని పేర్కొన్నారు. అనంతరం కనగల్ మండలం చిన్నమాదారంలో 33/11కేవీ సబ్‌స్టేషన్ పనులకు భూమి పూజ చేశారు. తిప్పర్తి మండలం కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చిరుత శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు ఉదయం నల్లగొండలోని శ్రీనగర్‌కాలనీ పార్కులో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. పరిష్కరించే దిశగా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. నల్లగొండ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఈఓ బి.భిక్షపతి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ఎఫ్ఏసీ హెచ్ఎం శంకరయ్య, కనగల్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఎస్ఈ పాల్‌రాజు, ఆర్డీఓ రవి, కాంగ్రెస్ నేత గుమ్మలమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- షరతులన్నీ ఎత్తేయాలని జూలకంటి డిమాండ్

రామగిరి, ఆగస్టు 29 : ఎన్నికల వాగ్దానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. షరతులన్నీ ఎత్తేసి రైతులను రుణ విముక్తులను చేయాలని కోరారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ రుణమాఫీ కోసం విడుదల చేసి జీఓ 567లో అనేక నిబంధనలు పెట్టడం వల్ల అర్హులైన రైతులు కూడా మాఫీకి దూరమవుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఏకకాలంలో రూ.2లక్షల మాఫీ చేస్తామన్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడు విస్మరించారని విమర్శించారు. పంటల పెట్టుబడి రైతు భరోసా నిధులను కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో 5,42,306 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉండగా, ఇప్పటి వరకు 1, 71, 781 మందికే రుణ మాఫీ అయిందన్నారు. మిగిలిన రైతులకు ఎప్పటి వరకు చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు బండ శ్రీశైలం, కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాషం, సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎండీ సలీం, రవినాయక్, నన్నూరి వెంకటరమణారెడ్డి, నాంపల్లి చంద్రమౌళి, అశోక్ పాల్గొన్నారు.



నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి



గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

## గురుకులాలపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలి

- కొండభీమనపల్లి గురుకులం ఎదుట బీఆర్ఎస్వీ ధర్నా
- ఎలుకలు కరిచిన పిల్లలతో మాట్లాడి సమస్యలపై ఆరా

దేవరకొండరూరల్, ఆగస్టు 29 : దేవరకొండ మండలం కొండభీమనపల్లి శివారులోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఎలుకలు కరిచిన 13 మంది విద్యార్థులను బీఆర్ఎస్వీ నాయకులు గురువారం పరామర్శించారు. గురుకులంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ గురుకుల పరిసరాలు పరిశుభ్రంగా లేక పోవడం వల్ల ఎలుకల బెడద తీవ్రంగా ఉందన్నారు. వసతులు, కరెంట్ బోర్డులు, బాత్‌రూమ్‌లు, కిటికీలు సరిగ్గా లేవని తెలిపారు. ప్రభుత్వం స్పందించి గురుకులాల్లోని సమస్యలను పరిష్కరించి, అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు పి.లక్ష్మణ్, రమేశ్, గుండాల వెంకట్, విక్కీ, హరికృష్ణ, వెంకటేశ్, గోపి, శ్రీను, అనిల్, రవి పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ కూడా బాధిత విద్యార్థులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కేసీఆర్ సర్కారులో సకల సౌకర్యాలతో ఓ వెలుగు వెలిగిన గురుకులాలు నేడు కాంగ్రెస్ పాలనలో సమస్యల కూపంగా మారాయన్నారు. విద్యార్థులపై ఎలుకలు దాడి గురుకులాల పరిస్థితిని, కాంగ్రెస్ పాలనను తేటతెల్లం చేస్తున్నదని మండిపడ్డారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక
విలేకరులు కావలెను
తెలంగాణ ప్రజల విశేష ఆదరణ పొందిన ప్రముఖ దిన పత్రిక 'నమస్తే తెలంగాణ' లో పనిచేయుటకు విలేకరులు కావలెను. సామాజిక స్పృహ, అంకితభావంతోపాటు తెలుగు భాషా పరిజ్ఞానం, స్థానిక సమస్యలపట్ల అవగాహన ఉన్నవారు పూర్తి బయోడేటాతో రాత పరీక్షకు హాజరు కాగలరు. జర్నలిజంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది.
పరీక్ష తేది :
31-8-2024, శనివారం, ఉ॥ 11 గంటల నుంచి 12 గంటల వరకు
స్థలం : నమస్తే తెలంగాణ టౌన్ ఆఫీస్,
L.P.T.మార్కెట్, 1st Floor, Hyd Road. నల్లగొండ
పని చేయవలసిన డేట్‌లైన్లు
నల్లగొండ జిల్లా: దేవరకొండ, చండూరు, వేములపల్లి
యాదాద్రి భువనగిరి జిల్లా : భువనగిరి సిటీ, ఆలేరు టౌన్
సూర్యాపేట జిల్లా : ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, నాగారం, గరిడేపల్లి, తుంగతుర్తి
వివరాలకు : 91827 77972

## ఇగ్నో కోర్సులకు దరఖాస్తులు

- హైదరాబాద్ రీజినల్ అడిషనల్ డైరెక్టర్ రమేశ్

రామగిరి, ఆగస్టు 29 : ఇగ్నో యూనివర్సిటీ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ హైదరాబాద్ రీజనల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ కె.రమేశ్ సూచించారు. నల్లగొండలోని కాకతీయ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న ఇగ్నో స్టడీసెంటర్‌ను గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. నల్లగొండ స్టడీ సెంటర్‌లో డిగ్రీలో బీఏ, బీఏ సైకాలజీ, బీఏ ఇంగ్లిష్, బీఏ ఉర్దూ బీకాం జనరల్, కంప్యూటర్‌సైన్స్, బీఎస్సీ, పీజీ ఎంఎస్‌డబ్ల్యూ, ఇంగ్లిష్, ఎంఎస్‌డబ్ల్యూ, కోర్సులతోపాటు డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఈనెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో ఉచిత ప్రవేశం ఉందన్నారు. తరగతుల నిర్వహణ నల్లగొండలో ఉంటుందని, పరీక్షలు హైదరాబాద్‌లో రాయాల్సి ఉంటుందన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. పూర్తి వివరాలకు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాసులును 9985525003లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహారెడ్డి, అమృతారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతన్న

- వరద కాల్వకు నీళ్లివ్వాలని అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై రాస్తారోకో
- సాగర్ నిండకుండలా తొణికిసలాడుతున్న నీళ్లందని దైనం



మాడ్గులపల్లి మండలం కుక్కడం అద్దంకి – నార్కట్‌పల్లి రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

మాడ్గులపల్లి, ఆగస్టు 29 : సాగునీటి కోసం మాడ్గులపల్లి మండల రైతులు రోడ్డెక్కారు. గురువారం వరద కాల్వకు నీళ్లివ్వాలని డిమాండ్ చేస్తూ కుక్కడం గ్రామ సమీపంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై గురువారం 8 గ్రామాల వాళ్లు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ 28 రోజుల క్రితం మంత్రులు వరద కాల్వ నీటిని విడుదల చేసినా నేటికీ చివరి భూములకు నీరందడం లేదన్నారు. కంపచెట్లు పెరిగి, చెత్తాచెదారం పేరుకుపోయి కాల్వ అధ్వానంగా తయారైందని తెలిపారు. మాడ్గులపల్లి, దాచారం, చెరువుపల్లి, ఇందుగుల, మర్రిగూడెం, తోపుచర్లలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ఆవేదన చెందారు. పది రోజుల క్రితం రాస్తారోకో చేస్తే.. చివరి భూముల వరకు నీళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్న అధికారులు ఇప్పుడు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా ఉన్నా చివరి భూములకు నీళ్లు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాస్తారోకోతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి రైతులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపచేశారు. ఆందోళనలో రైతులు శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనూ నాయక్, సైదులు, వెంకన్న, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
పదవీవిరమణ శుభాకాంక్షల ప్రకటనలు

మీ బంధువులు, స్నేహితులు, మీ శ్రేయోభిలాషులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా..?
అయితే మీ శుభాక్షరాల శుభాకాంక్షలను నమస్తే తెలంగాణ ద్వారా ఒక తీపి గుర్తుగా అందించండి... ఆనందించండి...
ప్రకటనలకై సంప్రదించండి...
25% DISCOUNT
5% GST EXTRA
సెల్: 9182777625
నల్లగొండ : 9182777635
సూర్యాపేట : 9182777630
మిర్యాలగూడ : 9182777059
భువనగిరి : 9182777638
కోదాడ : 9182777059
హుజూర్‌నగర్ : 9182777059
దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
చౌటుప్పల్ : 9182777638